

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొంటుంది

- రైతులకు రాష్ట్ర మంత్రి సీతక్క భరోసా


మంత్రి సీతక్క

ములుగు, మే 18: వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి కాంటాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం సేకరిస్తుందని తెలిపారు.

ఇక నుంచి పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని, ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని, అన్నదాతలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పనులు నాణ్యతతో నిర్వహించాలి

అదనపు కలెక్టర్ శ్రీజ

అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన


మురుమూరు పాఠశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వాజేడు, మే 18 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులను నాణ్యతతో చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించా రు. మండలంలో శనివారం పర్యటించి పాఠశాలల అభివృద్ధి పనులను పరిశీలించారు. అరుణాచలపురం, మురుమూరు కాలనీలో మరమ్మతులు జరుగుతున్న పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిం చాలన్నారు. మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, రంగులు, తదితర పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. అదేవిధంగా పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొప్పుసూరులో నిర్వహిస్తు న్న కుట్టుమిషన్ల కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థుల యూనిఫామ్‌లను త్వరితగతిన అందించాలన్నారు. ఆమె వెంట డీఆర్‌డీవో శ్రీనివాసరావు, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, ఎంఈవో వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి

వెంకటాపురం(నూగూరు) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని

» మిగతా 8వ పేజీలో..

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన పరకాల వాసి

తెలంగాణ రాష్ట్ర కీర్తిని నలు దిశలా చాటిన చిరంజీవి



ఎవరెస్ట్ శిఖరంపై చిరంజీవి

పరకాల, మే 18: పరకాల పట్టణానికి చెందిన ఏకు చిరంజీవి ఎవరెస్ట్ శిఖరాన్ని శుక్రవారం అధిరోహించారు. ఈ నెల 9న నేపాల్ దేశంలో అడుగుపెట్టి కాలినడకన ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ 8 రోజులు శ్రమించి ఈ నెల 17న ఉదయం 11.55 నిమిషాలకు ప్రపంచంలోనే ఎత్తైన శిఖరం ఎవరెస్ట్ బేస్ క్యాంపును చేరుకున్నారు. ప్రపంచ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఎవరెస్ట్ శిఖరం బేస్‌క్యాంప్ మీద సముద్రమట్టం 17వేల 598 అడుగులు (5వేల 364 మీటర్లు) ఎత్తులో తెలంగాణ తల్లి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. అదే విధంగా భరతమాత చిత్రపటంతోపాటు జాతీయజెండాను రెపరెపలాడించాడు. అదే విధంగా డాక్టర్ బీఆర్.అంబేద్కర్, భగత్‌సింగ్‌ల చిత్రపటాలను సైతం ఆవిష్కరించి దేశ ఔన్నత్యాన్ని చాటారు. కాలినడక 130 కిలోమీటర్లు, 14 రోజులపాటు సాగిన ఈ సాహస ప్రయాణాన్ని కొనసాగించి దేశానికి తిరిగి రాబోతున్నారు. ఇంతకుముందు 2022లో దేశంలోని ఉత్తరాఖండ్, కేదార్ కంఠపర్వతం మీద 13500 అడుగుల ఎత్తులో తెలంగాణ తల్లి చిత్రపటాన్ని ఆవిష్కరించి నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేసిన ఘనత చిరంజీవికి ఉంది. ఈ సందర్భంగా చిరంజీవిని పలువురు అభినందించారు.

ఆది నుంచి వివాదాలే..

కేయూ వీసీ రమేశ్‌పై అవినీతి, అక్రమాల ఆరోపణలు

'ఆంధ్రజ్యోతి' కథనాలు, అకుట్ ఫిర్యాదుతో ప్రభుత్వం చర్యలు

యూనివర్సిటీ చరిత్రలోనే మొదటిసారిగా వీసీపై విజిలెన్స్ విచారణ



వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్రలోనే ఉపకులపతిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టడం మొదటి సారి కావడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలకు వీసీల నియామకం చేపడుతున్న క్రమంలో కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌పై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. జూన్ 2021లో వీసీగా పదవి చేపట్టిన నాటి నుంచి ప్రొఫెసర్ రమేష్ వివాదాల సుడిగుండంలో చిక్కుకునే ఉన్నారు. అప్పట్లో ఆయన నియామకమే చర్చనీయాంశంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా అడ్డదారుల్లో అప్పటి ప్రభుత్వ పెద్దల సహకారంతో వీసీ పదవి పొందారని బాహాటంగానే విమర్శలు వెల్లువెత్తాయి. అప్పటి ఎమ్మెల్సీ, ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రమేయంతోనే రమేష్ కేయూ వీసీ అయ్యారని వర్సిటీలో ప్రచారం జోరుగానే సాగింది. ఇక కేయూలో భూముల అన్యాక్రాంతం, అధ్యాపకుల నియామకం, పీహెచ్‌డీ ప్రవేశాల్లో జరిగిన పలు అవకతవకలపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితం, అకుట్, తదితర అధ్యాపక సంఘాలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో శనివారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం వీసీ రమష్‌పై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేయడం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

వివాదాల సుడిగుండలోనే..

కేయూ వీసీగా ప్రొఫెసర్ టి.రమేష్ నియామకమైన నాటి నుంచి వివాదాల సుడిగుండలోనే చిక్కుకునే ఉన్నారు. ఆయన నియామకం మొదలుకొని పెన్షన్ ఫైల్ వరకు అన్నీ అవినీతి, అక్రమాల ఆరోపణలతోనే విమర్శలను ఎదుర్కొంటూ వస్తున్నారు. అక్రమంగా పదోన్నతి పొంది వీసీగా నియామకమైనట్లు వర్సిటీవర్గాలు ఆయన నియామకాన్నే వ్యతిరేకించాయి. జూన్ 2021న అప్పటి ప్రభుత్వ పెద్దల సహకారంతోనే వీసీగా నియమితులయ్యారని వర్సిటీ వర్గాలు మొదటి నుంచి ఆక్షేపిస్తూనే ఉన్నాయి. అప్పటి ఎమ్మెల్సీ, ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి దగ్గరైన రమేష్. ఆయన పైరవీతోనే వీసీ అయ్యారని బాహాటంగానే విమర్శలు వెల్లువెత్తాయి.

అవినీతి, అక్రమాల ఆరోపణలు

వీసీ రమేష్‌పై అకుట్‌తో పాటు పలు అధ్యాప సంఘాలు తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు చేస్తూనే వచ్చాయి. ఆయన అవినీతి, అక్రమాలపై ఆధారాలతో సహా పలుమార్లు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా 16మంది రిటైర్డ్ అధ్యాపకులను అడ్జంట్ ఫ్యాకల్టీగా నియమించి రూ.8లక్షలు ప్రభుత్వ ఖజానాకు నష్టం చేసినట్లు ఆరోపణలున్నాయి. కేయూ భూములు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోకుండా కబ్జాదారులకు కొమ్ముకాసినట్లు విమర్శలున్నాయి. పాలకమండలి లేకుండానే అక్రమ ప్రమోషన్లకు పాల్పడ్డారని, పీహెచ్‌డీ ప్రవేశాల్లో సైతం వీసీ రమేష్ అవినీతికి పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలు తీవ్రంగానే ఉన్నాయి. వీసీగా తన అనర్హత కేసును వాదించేందుకు సంబంధలేని అడ్వకేట్‌కు లక్షల రూపాయలు ఇచ్చారని, యూనివర్సిటీలో స్టాండింగ్ కౌన్సిల్ ఉండగా అదనంగా మరో న్యాయవాదితో వకాలత్ చేయించి అదనంగా రూ.5లక్షలు చెల్లించన విమర్శలను ఆయన ఎదుర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ అక్రమ బదిలీలు, ప్రమోషన్లకు, పాలక పదవులు కట్టబెట్టి అవినీతికి పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలున్నాయి.

గత ప్రభుత్వ పార్టీకి అనుకూలం

వీసీ రమేష్ గత పాలక ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీకి తొత్తుగా ఉంటూ ఆ పార్టీ పెద్దలు చెప్పిన పనులు చక్కబెట్టినట్లు సైతం విమర్శలు వెల్లువెత్తాయి. కేటీఆర్ చెప్పారని ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్ రావు దగ్గరి బంధువైన ఖమ్మం పీజీ కళాశాలలో పనిచేస్తున్న రజిత అనే మహిళా లెక్చరర్‌ను హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలకు బదిలీ చేశారనే విమర్శలున్నాయి. గత ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే వర్సిటీ పాలన కొనసాగించినట్లు అధ్యాపక సంఘాలు బాహాటంగానే విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వంలో వీసీ రమేష్‌పై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనంగా అధ్యాపకవర్గాలు చెప్పుకుంటున్నాయి.

ఆంధ్రజ్యోతి కథనాలు, అకుట్ ఫిర్యాదుతో..

కేయూ వీసీ రమేష్ అవినీతి, అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలతో పాటు అకుట్, ఇతర అధ్యాపక సంఘాల ఫిర్యాదుతో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఆంధ్రజ్యోతిలో మార్చి 23న 'అక్రమాలకు కేరాఫ్ కేరాఫ్ కేయూ', ఏప్రిల్ 6న 'కేయూ కబ్జాలపై చర్యలేవి', మే 17న(శుక్రవారం) ప్రచురితమైన 'కేయూ ప్రక్షాళన జరిగేనా' తదితర కథనాల నేపథ్యంలో ప్రభుత్వం ఇంటెలిజెన్స్ సమాచారం సేకరించింది. అలాగే వర్సిటీలోని అకుట్‌తో పాటు వివిధ అధ్యాపక సంఘాలు వీసీ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేయడంతో స్పందించిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. వీసీపై వస్తున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాల్సిందిగా వెంకటేశం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలా వుండగా, ఈ నెల 21న ఆయన పదవీకాలం ముగియనుండడం.. అంతలోనే ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడం.. వర్సిటీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

విచారణను స్వాగతిస్తున్నా.. : వీసీ

వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా తనపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిని విజిలెన్స్ విచారణను స్వాగతిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ టి. రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీసీగా మూడేళ్ల పదవీకాలంలో ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. నిరుపేద కుటుంబంలో జన్మించి ఇక్కడే విద్యనభ్యసించి 30 ఏళ్లకు పైగా పనిచేశానని పేర్కొన్నారు. వీసీగా ప్రతికూల పరిస్థితులను అధిగమించి వర్సిటీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశానని తెలిపారు. తన కృషి ఫలితంగానే న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ వచ్చిందని తెలిపారు. జాతీయ స్థాయిలో వర్సిటీ హోదా, ప్రతిష్టను పెంపొందించినట్లు పేర్కొన్నారు. తన హయాంలోనే ప్రతిష్మాత్మకమైన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను నిర్వహించామని తెలిపారు. సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన అన్ని రకాల బకాయిలు, అందాల్సిన సదుపాయాలు అందించానని పేర్కొన్నారు. యూనివర్సిటీ చరిత్రలోనే మొదటి సారిగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 507 మంది దినసరి, తాత్కాలిక ఉద్యోగులకు జీతాలు 4 నుంచి 5 రెట్లు పెంచామని తెలిపారు. వర్సిటీలో అధ్యాపకులు కొరత ఉన్నప్పటికీ 300 మందికిపైగా నిబంధనల మేరకు పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో తనపై కొందరు ఆరోపణలు చేయడంతో ప్రభుత్వం విచారణ కమిటీని నియమించి విచారణ చేపట్టగా పీహెచ్‌డీ ప్రవేశాలు నిబంధనల మేరకే పారదర్శకంగా జరిగాయని నివేదిక ప్రభుత్వానికి అందించిందని తెలిపారు. తన కాలంలో ఒక్క పర్మినెంట్ రిక్రూట్‌మెంట్ జరగలేదని స్పష్టం చేశారు. యూనివర్సిటీకి సంబంధించి ఒక్క గుంట భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడగలిగానని తెలిపారు. దొడ్డిదారిలో ప్రమోషన్లు పొందాలని, వర్సిటీ అభివృద్ధిని ఓర్వలేక, వర్సిటీ ప్రతిష్టను దిగజార్చే వ్యక్తులు, అక్రమంగా అడ్మిషన్లు కావాలని గగ్గోలు పెట్టిన వారు చేసిన ఫిర్యాదు మీద ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టడాన్ని తాను హర్షిస్తూ స్వాగతిస్తున్నానని వీసీ పేర్కొన్నారు.

రూ.10లక్షల కోట్లతో వరంగల్ అభివృద్ధి

- రైల్వే వ్యాగన్ కోచ్, మెగాటెక్స్‌టైల్, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు
- రామప్పకు యునెస్కో గుర్తింపు
- రూ.500కోట్లతో రింగ్‌రోడ్డు నిర్మాణం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, మే18: వరంగల్ నుంచి బీజేపీ ఎంపీల ప్రాతినిధ్యం లేకున్నప్పటికీ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వరంగల్ ఉమ్మడి జిల్లాకు రూ.10 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా హంటర్‌రోడ్డులో శనివారం జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అధ్యక్షతన జరిగిన ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాల ఆత్మీయ సమ్మేళనం, ఉమ్మడి జిల్లాలోని బీజేపీ మండల, డివిజన్ అధ్యక్షుల సమావేశాల్లో వేర్వేరుగా కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి రాకముందు 2,500 కిలోమీటర్ల మేరకే జాతీయ రహదారులుంటే.. ఈ 9 యేళ్లలో 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్న దేశాన్ని.. మోదీ ప్రపంచంలోనే 5వ ఆర్థిక శక్తి మార్చాడని గుర్తుచేశారు. రామగుండంలో థర్మల్ ప్రాజెక్టును ఏర్పాటు చేసి విద్యుత్‌శక్తిని ఉత్పత్తి చేస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే మొట్టమొదటిగా రామప్పకు యునెస్కో గుర్తింపు రావడానికి మోదీ కృషి చేశారన్నారు. వేయిస్తంభాల గుడి కల్యాణ మండప పనులను పునరుద్ధరించామన్నారు. దేశంలో 7 మెగా టెక్స్‌టైల్స్ ఉంటే.. ప్రధాని మోదీని ఒప్పించి అందులో ఒకటి వరంగల్‌కు తీసుకు వచ్చామన్నారు. రైల్వే వ్యాగన్‌నుకు శంకుస్థాపన చేసుకొని పనులను వేగవంతంగా చేసుకుంటు న్నామన్నారు. మెనిఫెస్టోలో పెట్టిన విధంగా ఆర్టికల్ 370ని రద్దు చేశామన్నారు. ధర్మం కోసం, గౌరవం కోసం పనిచేసే పార్టీ బీజేపీ అని, మోదీ ద్వారా దేశానికి గౌరవం దక్కిందన్నారు. మొదటి సారి అధికారంలోకి వచ్చినప్పుడు 270, రెండోసారి 307 సీట్లు వచ్చాయని, మూడోసారి 400 సీట్లలో బీజేపీ విజయం సాధించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధానిగా మళ్లీ మోదీ బాధ్యతలు చేపట్టబోతున్నాడని పేర్కొన్నారు.

ప్రతిపక్ష నాయకులు పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతూ నమ్మిన ప్రజలను మోసం చేస్తున్నారని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కడియం, దానం నాగేందర్‌లను నమ్మి ప్రజలు గెలిపిస్తే సిగ్గులేకుండా ఆ పార్టీ రాజీనామా చేయకుండానే అధికార పార్టీలోకి చేరారని మండిపడ్డారు. దమ్ముంటే రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి తేల్చుకోవాలన్నారు. బీజేపీలో 8మంది ఎమ్మెల్యేలున్నారని, వారంతా తెలంగాణ ప్రజల హక్కుల కోసం కొట్లాడుతారన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ లెక్క నమ్మిన ప్రజలను మోసం చేయరని అన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు ఒక్కటేనని, రెండు వేర్వేరు కాదన్న విషయం ప్రజలు గమనించాల న్నారు. అందుకే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో కి వస్తున్నారని రేవంత్‌రెడ్డి అంటున్నాడని గుర్తుచేశారు. కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా పబ్బం గడుపుతోందని విమర్శించారు. తెలంగాణ సాధనలో సుష్మాస్వరాజ్, ఎల్‌కే అద్వానీ ఆధ్వర్యంలో బీజేపీ ఉద్యమించిన విషయం, జేఏసీతో కలిసి పనిచేసిన విషయం ఉద్యోగులు, మేధావులు గుర్తుంచుకోవాలన్నారు. ప్రతిపక్ష పాత్ర పోషించే బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కిషన్ రెడ్డి కోరారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 12 సీట్లు బీజేపీ గెలవబోతోందని, అదే స్ఫూర్తితో ఎమ్మెల్సీని గెలిపించి విద్యావంతులు తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పట్టభద్రుల ఎన్నికల ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు జనార్దన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఎంపీ అభ్యర్థులు అరూరి రమేష్, అజ్మీరా సీతారాంనాయక్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మార్తినేని ధర్మారావు, వివిధ జిల్లాల అధ్యక్షులు, ఎమ్మెల్యేగా పోటీచేసిన అభ్యర్థులు పాల్గొన్నారు.

నేను ప్రశ్నించే గొంతుకను..

- మేధావులనే శాసనమండలికి పంపాలి..
- బీజేపీ నన్ను రాజకీయంగా హత్య చేస్తే.. కేసీఆర్ ఆదరించారు..
- కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు కావడంలేదు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యనే పోటీ
- పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి


మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి

వడ్డెపల్లి, మే 18: ప్రజా, ఉద్యోగ, నిరుద్యోగుల సమస్యలపై నిత్యం పోరాడి ప్రశ్నించే గొంతుకను అవుతానని వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన మాట్లాడారు. మేధావులు, విద్యావంతులు తనను ఆశీర్వదించి శాసనమండలికి పంపించాలని కోరారు. మోసగాళ్లు, బ్రోకర్లకు అవకాశం ఇస్తే గోసపడక తప్పదన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ తనను రాజకీయంగా హత్య చేసి నడిబజారులో పడేస్తే కేసీఆర్ చేరదీసి గుండెల్లో పెట్టుకున్నారని రాకేష్‌రెడ్డి ఆవేదనతో చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు కావడం లేదని ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆరోపించారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే వచ్చే వేతనంతో పేద పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని రాకేష్‌రెడ్డి తెలిపారు. మెగా డీఎస్సీ జాబ్ క్యాలెండర్ ఏర్పాటుతో పాటు ఉద్యోగుల పీఆర్‌సీ సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నిస్తానని పేర్కొన్నారు. వరంగల్‌లో వరదలొస్తే వందలాది మందికి ఆహార ప్యాకెట్లు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేశానని పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో రెడ్‌జోన్‌లలో తిరిగి ప్రజలకు భరోసా కల్పించడంతో పాటు వారికి అవసరమైన నిత్యావసర సరుకులను అందజేసినట్లు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 34 శాసనసభ నియోజకవర్గాల్లో 32మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారని, కేవలం బీఆర్‌ఎస్‌కు చెందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డిలు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారని రాకేష్‌రెడ్డి చెప్పారు. బలమైన ప్రతిపక్షం బలమైన నాయకుడిని మండలికి పంపిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. జీవో నంబర్ 46 రద్దు చేస్తామని చెప్పినా.. అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ఐదు నెలలు గడిచినప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదని విమర్శించారు. తాను ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత జీవో నంబర్ 46 రద్దు కోసం ప్రజలతో కలిసి పోరాడు తానని చెప్పారు. తనను ఆదరించి, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాకేష్‌రెడ్డి కోరారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు బీఆర్ లెనిన్, గాడిపెల్లి మధు, మస్కపురి సుధాకర్‌తో పాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రజా గొంతుకనై పోరాడుతా..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి
- మడికొండలో ఎన్నికల సన్నాహక సమావేశం


సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు

మడికొండ, మే 18: తనను ఆశీర్వదించి మండలికి పంపిస్తే ప్రజా గొంతుకనై సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో శనివారం మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య అధ్యక్షన జరిగిన ఎమ్మెల్సీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశంలో రాకేశ్‌రెడ్డి మాట్లాడారు. పుట్టిన గడ్డకు రుణం తీర్చుకోవాలని, వరంగల్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని విదేశాల్లో ఉన్నతమైన ఉద్యోగం వదిలి వరంగల్‌కు వచ్చానన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ కాంగ్రెస్ పార్టీ చెప్పిన మోసపూరిత హామీలు నమ్మి ప్రజలు వారికి పట్టం కట్టారన్నారు. జాబ్ క్యాలెండర్ హామీ మీద ఇప్పటివరకు ఒక్క ప్రకటన లేదని, నాలుడు వేల నిరుద్యోగుల భృతి మీద చర్చ లేదన్నారు. మెగా డీఎస్సీ మీద ఒక్క మాటలేదని, అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీని గెలిపిస్తే ప్రజాపక్షమై, ప్రజా గళమై, ప్రజాగొంతుకై మండలిలో పోరాడే వ్యక్తిని పంపినట్లవుతుందని తెలిపారు. విద్యావంతులు, నిరుద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పట్ల తనకు సంపూర్ణమైన అవగాహన ఉందని, వారి సమస్యల పై పోరాటం సాగించి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తన మాయ మాటలతో, ప్రతీ రోజూ పార్టీలు మారుతూ, బెదిరిస్తూ బ్రోకరిజం చేసే తీన్మార్ మల్లన్నకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. నీతి, నిజాయితీతో పేదలకు సేవ చేయాలని వచ్చిన రాకేశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి చట్ట సభకు పంపాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, సుధీర్‌కుమార్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ నాయకులు, పట్టభద్రులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల నిధుల దుర్వినియోగం

- కొందరు అధికారుల నిర్వాకం
- ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు
- విచారణకు కలెక్టర్‌కు సీఈవో ఆదేశం

హనుమకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కొందరు అధికారులు నిధులు వినియోగంలో చేతివాటం ప్రదర్శించినట్టు తెలుస్తోంది. సుమారు రూ.80లక్షల నుంచి రూ.90లక్షల మేరకు దుర్వినియోగానికి పాల్పడినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధ్యతాయుతమైన పౌరుడి పేరుతో ఒక అజ్ఞాత వ్యక్తి ఈ విషయమైన ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేశాడు. సీఈవో ఈ విషయమై విచారణ జరపాల్సిందిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను కోరారు. వివరాల్లోకి వెళితే..

కిందటేడు నవంబరులో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన నిధులను ప్రభుత్వం అన్ని జిల్లా కలెక్టరేట్లకు అందుబాటులో ఉంచింది. ఇదే అవకాశంగా తీసుకొని కొందరు అధికారులు నిధుల వినియోగంలో చేతివాటం ప్రదర్శించినట్టు ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశాడు. హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో కీలక హోదాలో ఉన్న ఒక అధికారి, ఒక డిప్యూటీ తహసీల్దార్ దొంగ బిల్లులు పెట్టి సుమారు రూ.80 నుంచి రూ.90లక్షల వరకు దుర్వినియోగం చేశారని, కలెక్టర్‌ను తప్పుదోవపట్టించారని అందులో పేర్కొన్నాడు. మరో డిప్యూటీ తహసీల్దార్ పరకాల నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి పెద్దఎత్తున నిధులను దుర్వినయోగానికి పాల్పడ్డాడని, ఇట్లా అడ్డంగా సంపాదించిన నిధులతో ఇటీవలే విలాసవంతమైన కియా కార్‌ను కొనుగోలు చేశాడని, అంతే కాకుండా లోక్‌సభ ఎన్నికల్లో కూడా నిధుల దుర్వినియోగానికి ఎత్తుగడ వేశాడని తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల ముందు నాటికి హనుమకొండ కలెక్టర్‌లో పని చేసిన పూర్వ ఆర్‌డీవోకు అత్యంత సన్నిహితులైన మరో ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు కూడా తప్పుడు బిల్లులు సమర్పించి పెద్ద మొత్తంలో నిధులు స్వాహా చేశారని కూడా ఆరోపించారు. ఈ నలుగురు ఉద్యోగులు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ నాయకులకు పూర్తిగా సహాయ, సహకారాలు అందించి తద్వారా పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించారని కూడా ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవలసిందిగా ఆయన కోరారు. తన దగ్గర పూర్తి వివరాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఫిర్యాదుపై సీఈవో వికాస్‌రాజ్ సానుకూలంగా స్పందించారు. దీనిపై విచారణ జరపాల్సిందిగా కోరుతూ హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను ఆదేశించారు. కలెక్టర్ దీనిపై అంతర్గతంగా విచారణ జరుపుతున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై కలెక్టర్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఫిర్యాదు అందగానే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.


ర్యాంకులు సాధించిన ఎస్సార్ విద్యార్థులు

ఎప్‌సెట్ ఫలితాల్లో ఎస్సార్ ప్రభంజనం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాల్లో ఎస్సార్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి అన్నారు. ఎంపీసీ విభాగంలో కొంతం మణితేజ రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించగా దొంతుల మనీష్ 24, టి. తేజస్వీ 161, ముంకాల గణేష్ 199, కె. శ్రీరామ్‌రెడ్డి 291, చల్ల హర్షిత 334, ఆర్. దీపాన్షురెడ్డి 412, కె.వర్షిణి 494, ఎస్.రాహుల్ 546, జి.రాజీవ్ 552, అబుతల్హా 554 ర్యాంకు సాధించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను వినూత్నమైన పద్ధతుల్లో బోధించడం వల్లనే నిరంతరం ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని వరదారెడ్డి అన్నారు. 50 యేళ్లుగా పటిష్టమైన ప్రణాళికతో హైస్కూల్, జూనియర్ కళాశాలలు, ఎప్‌సెట్, ఐఐటీ, నీట్‌లలో బోధన చేస్తున్నామన్నారు. విద్యార్థుల పట్టుదల, అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారంతో ఎస్సార్ విద్యార్థులు ఎప్పటికప్పుడు ఫలితాల్లో ప్రత్యేక స్థానాన్ని నెలకొల్పుతున్నారన్నారు. డైరెక్టర్లు సంతోష్ రెడ్డి, మధుకర్‌రెడ్డితో కలిసి విద్యార్థులను అభినందించారు.

శివాని విద్యార్థుల విజయదుందుభి


ర్యాంకులు సాధించిన శివాని విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: ఎప్‌సెట్ ఫలితాల్లో శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి విజయదుందుభి మోగించినట్లు కళాశాల కరస్పాండెంట్ టి.స్వామి తెలిపారు. శనివారం ప్రకటించిన ఫలితాల్లో శివాని కళాశాల విద్యార్థులు చరిత్ర తిరగరాస్తూ మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. గుర్రం వర్షిత 3854 ర్యాంకు, చీమకుర్తి సాద్విక 4036, వోడపెల్లి అస్విత 5731, కుసుమ శ్రీజ 6316, దాసరి స్వేత 8917, తిప్పారపు గణేష్ 9080, అరికిల్ల నిస్సి 9732, రాయబోయిన తిరుపతి 9813, వడ్డె రిషితప్రియ 10668 ర్యాంకు సాధించారన్నారు. వీరితో పాటు పలువురు విద్యార్థులు సైతం ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కరస్పాండెంట్ టి.స్వామి పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్స్ జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి.రాజు, ఎన్.రమేష్, ఏ.మురళీధర్, వి.సురేశ్, ఎస్.సంతోష్‌రెడ్డి అభినందించారు.

ఎంసెట్‌లో షైన్ విజయకేతనం


ర్యాంకులు సాధించిన షైన్ విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 18: ఎంసెట్ - 2024 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 466, 1370 ర్యాంకు సాధించి కార్పొరేట్ విద్యాసంస్థలకు సమానంగా ఫలితాలు సాధించినట్లు షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగుల కుమార్ యాదవ్ తెలిపారు. మెడికల్ కేటగిరిలో టి.హేమప్రియ 466, ఎండి.సోహెల్ 732, ఆర్.వైష్ణవి 7645, ఆర్.ధనస్మిత 8525 సాధించగా, ఇంజనీరింగ్ కేటగిరిలో వి.సరయురెడ్డి 1370 ర్యాంకు, సిమి రిజ 1385 ర్యాంకు, బి.రుణ్ 3154, సిహెచ్. చరణ్‌తేజ 6371, పి.జయంత్ 9103 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వీరితోపాటు మెడికల్ కేటగిరిలో 22 మంది విద్యార్థులు 15వేల లోపు మార్కులు, ఇంజనీరింగ్ కేటగిరిలో 36 మంది 15వేలలోపు మార్కులు సాధించారని ఆయన తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నిరంతర పర్యవేక్షణ, మోటివేషన్‌తో మాములు విద్యార్థులను కూడా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు పి.రాజేంద్రకుమార్, మూగుల రమ, మూగుల రమేశ్, మారబోయిన రాజుగౌడ్, కొత్తకొండ శ్రీనివాస్‌గౌడ్, ప్రవళిక, అధ్యాపక బృందం అభినందించింది.

భద్రకాళి దేవికి వసంతోత్సవం



వరంగల్ కల్చరల్, మే 18: నగరంలోని భద్రకాళి దేవస్థానంలో శనివారం (తొమ్మిదో రోజు) భద్రకాళి అమ్మవారికి వసంతోత్సవం పూజలు కన్నుల పండువగా జరిగాయి. ప్రధానార్చకులు భద్రకాళి శేషు వసంతోత్సవం పూజలు నిర్వహించారు. తెలంగాణ, వరంగల్ ఉమ్మడి జిల్లా గౌడ సంఘం ఉభయ దాతలుగా వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో కుల పెద్దలు పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం సర్వభూపాల వాహనంపై ఉత్సవమూర్తి ఊరేగారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నకిరేకంటి మోహన్‌గౌడ్, చింత రమేష్‌గౌడ్, దూలం రాజేందర్‌గౌడ్, పరమేశ్వర్‌గౌడ్, రాజుగౌడ్, రజినీకాంత్ గౌడ్, బీమగాని సౌజన్య పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో నిర్వహించాలి

(5వ పేజీ తరువాయి)

జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆమె మండలంలో పర్యటించారు. ముందుగా బర్లగూడెం గ్రామంలో సెర్ప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కుట్టుతున్న స్కూల్ యూనిఫామ్‌లను పరిశీలించారు. పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోపు యూనిఫామ్స్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నూగూరు, ఉప్పేడు గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలను పరిశీలించారు. జూన్ 15 కల్లా పాఠశాలల్లో మరమ్మతు, అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట డీపీవో శ్రీనివాస్‌కుమార్, ఎంఈవో వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ రాజేష్, ఎంపీవో హనుమంతరావు తదితరులు ఉన్నారు.

రేషన్‌కార్డుకు ఈ-కేవైసీ తప్పనిసరి

మొగుళ్లపల్లి, మే 18 : రేషన్‌కార్డుకు ఈ-కేవైసీ తప్పనిసరి అని తహసీల్దార్ సునీత డీలర్లకు సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్‌షాపుల డీలర్లతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. రేషన్‌కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ-కేవైసీ చేయించుకునేలా డీలర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ సురేందర్‌రెడ్డి, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల భద్రయ్య, డీలర్లు పాల్గొన్నారు.

చెరువు మరమ్మతు పనులు చేపట్టాలి

చిట్యాల, మే 18 : మండలంలో గతేడాది కురిసిన వర్షానికి తెగిపోయిన వంకసముద్రం చెరువు మరమ్మతు పనులు వెంటనే ప్రారంభించాలని నవాబుపేట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సాద రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శనివారం స్థానిక నాయకులతో కలిసి చెరువు ప్రాంతాన్ని సందర్శించి మాట్లాడారు. వంకసముద్రం చెరువు కట్ట గండ్లు పూడ్చితే సుమారు 200 మంది రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి చెరువు కట్ట మరమ్మతు పనులు ప్రారంభించి వానాకాలం లోపు పూర్తి చేయాలని కోరారు. నాయకులు వలబోజు నరేష్, తీగల బాలకృష్ణ, షైమత్, స్వామి, రాంబాబు, శ్రీను ఉన్నారు.

ఆశాలకు పారితోషికం ఇవ్వాలని వినతి

ములుగు కలెక్టరేట్, మే 18 : పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన తమకు పారితోషికం అందించాలని కోరుతూ ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు శనివారం ములుగు కలెక్టరేట్‌లో పరిపాలన అధికారి రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చే రెమ్యూనరేషన్ డబ్బులు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఆశాలకు రెమ్యూనరేషన్ డబ్బులు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.నీలాదేవి, ఆశాలు శిరీష, కేత, రజిత తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణాలు మాఫీ చేయాలి

టేకుమట్ల, మే 18 : రైతులకు వ్యవసాయ రుణాలతో పాటు బంగారం రుణాలను వెంటనే మాఫీ చేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారం చేపట్టిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు రుణమాఫీ చేయకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం పెట్టుబడి సాయం కూడా అందించకపోవడంతో రైతులు బంగారం బ్యాంకులలో తాకట్టు పెట్టి వ్యవసాయం చేసే దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో పాటు బంగారం రుణాలను మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. రైతులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అకాల వర్షంతో ఆగమాగం

నేల వాలిన వరి.. తెగిపోయిన బీటీ రోడ్డు



మండలంలోని గంగారంలో నేలవాలిన వరి పంట

కాటారం, మే 18 : మండలంలో అకాల వర్షంతో రైతాంగం ఆగమాగం అవుతోంది. శనివారం తెల్లవారు జామున గాలిదుమారంతో కూడిన వర్షం కురియడంతో పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల పరిధిలో వరి నేలవాలింది. జాదరావుపేట జీపీ పరిధిలోని గూడూరు సమీపంలో కాటారం-దామెర కుంట రోడ్డుపై ఉన్న వంతెన వద్ద రహదారి కొంత కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. రోడ్డు తెగడంతో వాహనదారులు అప్రమత్తంగా వెళ్లకుంటే ప్రమాదాలు చోటుచేసుకుంటాయని పలువురు హెచ్చరిస్తున్నారు. రేగులగూడెం, దేవరాంపల్లి, దన్వాడ, శంకరంపల్లి తదితర ప్రాంతాల్లో కళ్లాల్లో ఆరబోసిన యాసంగి వడ్లు తడవకుండా చేయడానికి రైతులు నానా తంటాలు పడ్డారు.

తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అశోక్

ములుగు కలెక్టరేట్, మే 18 : ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య పిలుపునిచ్చారు. శనివారం ములుగులో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో పేదల పక్షాన, నిరుద్యోగుల కోసం నిలబడి కొట్లాడిన మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, ఇందుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

- మంగపేట : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మురుకుంట్ల నరేందర్ పట్టభద్రులను కోరారు. శనివారం పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పర్యటించి ఓట్లను అడిగారు. మంగపేటలో విలేకర్లతో వారు మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యలపై, ఉద్యోగ సంఘాల మేలు కోరుకుని కొట్లాడే సమర్థుడు మల్లన్న అన్నారు. సమావేశంలో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

కాటారం, మే 18 : మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖోఖో కోచ్ కురుసం అశోక్‌కుమార్ నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు శనివారం క్రీడా దుస్తుల పంపిణీ జరిగింది. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీచర్ వావిళ్ల సురేందర్ జ్ఞాపకార్థం అతడి కుమారుడు సాగర్ క్యాంపులోని క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందించారు. ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించే సమ్మర్ క్యాంపులో 14ఏళ్ల లోపు పిల్లలు పాల్గొని శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోచ్ అశోక్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ ఉద్యోగులు భాస్కర్, సందీప్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు అనిల్, సాంబశివుడు, నాగరాజు, మోహన్, పీఈటీలు మంథెన శ్రీనివాస్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ప్రైవేట్ కంపెనీతో అగ్రిమెంట్ చేసుకోవాలి

ములుగు, మే 18 : వచ్చే వర్షాకాలంలో బాండ్ కల్టివేషన్ ద్వారా విత్తనోత్పత్తి చేసే రైతులు సంబంధిత ప్రైవేట్ కంపెనీతో అగ్రిమెంట్ తప్పకుండా చేసుకోవాలని, అగ్రిమెంట్‌ను పంటకాలం ముగిసేవరకు భద్రపరచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చందర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ములుగు, వెంకటాపూర్ మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పకుండా లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్దనే తీసుకోవాలని, రశీదు పంటకాలం ముగిసేవరకు భద్రపరచుకోవాలన్నారు. కంపెనీ లేబుల్ లేకుండా విత్తనాలు కొనుగోలు చేయకూడదని అన్నారు. అదేవిధంగా రైతులు తొందరపడి పత్తి విత్తనాలు విత్తుకోవద్దని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎం

కాటారం, మే 18 : మండలంలోని దామెరకుంటలో మ్యాక్స్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాఘవేందర్ శనివారం తనిఖీ చేశారు. మిల్లుల వద్ద వడ్ల బస్తాలను తీసుకెళ్లే లారీల వేబ్రిడ్జి తూకంలో తేడాలు వస్తున్నాయని రైతులు డీఎంకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎం కొనుగోలు కేంద్రంలో ఉన్న వడ్ల బస్తాలను తూకం వేయించగా కొన్ని బస్తాలు 40 కిలోలకు తక్కువగా బరువు ఉండటంతో కాంటాలు పెట్టే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాసాని రవి, రైతులు తదితరులు ఉన్నారు.

మీ ఓటును ఆత్మగౌరవంతో నిలబెడతా..

కాంగ్రెస్ ఎంఎల్‌సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

భూపాలపల్లిలో ఆత్మీయ సమ్మేళనం



కార్యక్రమంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లిటౌన్, మే 18 : కన్న తల్లిదండ్రుల సాక్షిగా పట్టభద్రులు వేసిన ఓట్లను వృథాగా పోనివ్వకుండా వారిని ఆత్మగౌరవంతో బతికేలా నిలబెడతానని కాంగ్రెస్ ఎంఎల్‌సీ అభ్యర్థి తీన్మార్‌మల్లన్న అన్నారు. శనివారం భూపాలపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షత వహించగా, తీన్మార్ మల్లన్న హాజరై మాట్లాడారు. గతంలో తాను ప్రశ్నించే స్థాయిలో ఉన్నానని, నేడు కాంగ్రెస్‌లోకి వచ్చి పట్టభద్రుల ఆశీర్వాదాలతో అమలు చేసే స్థాయిలో ఉంటానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ వచ్చాక సీఎంగా కేసీఆర్ పదేళ్లు పరిపాలించి ఇంటికో ఉద్యోగం కాదు కదా.. ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేదని అన్నారు. అలాగే 42 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రశ్నించే గొంతుకలు లేకుండా చేశారని తెలిపారు. ఈ క్రమంలోనే తాను ప్రశ్నించే గొంతుకనై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చానని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగాలపై ప్రత్యేక దృష్టి సారించి ఏయే ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయనే విషయమై అధికారులకు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండి ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్లలో కనీసం 17 లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు.

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ ఈ నెల 27న జరుగనున్న ఎంఎల్‌సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వాలు విద్య, వైద్యం నిర్లక్ష్యం చేశాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వాటిపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. అక్కడ మోదీ, ఇక్కడ కేసీఆర్‌లు ప్రజా సమస్యలు పరిష్కారం చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. పీసీసీ సభ్యుడు, ఎంఎల్‌సీ ఎన్నికల కోఆర్డినేటర్ విజయ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 14,368 పట్టభద్రులు ఉన్నారని, 8 మండలాల్లో 18 బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. కాగా పట్టభద్రులందరినీ కలిసి అత్యధిక ఓట్లు వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కొంరయ్య, సత్యనారాయణరెడ్డి, నాయకులు దేవన్, జంపయ్య, రాంచంద్రయ్య, రాజేందర్, జంపయ్య, శ్రీనివాస్, రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో సదరం క్యాంపు ఏర్పాటు

భూపాలపల్లి కలెక్టరేట్, మే 18 : భూపాలపల్లిలోని జిల్లా ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన సదరం క్యాంపులో 119 మంది పరీక్షలు చేయించుకున్నట్లు డీఆర్డీవో నరేష్ తెలిపారు. ఎముకలకు సంబంధించి 55 మంది, వినికిడి లోపం ఉన్నవారు 18, మానసిక దివ్యాంగులు 23 మంది, కంటి సంబంధిత సమస్యలు ఉన్న 23 మంది పరీక్షలు చేయించుకున్నట్లు పేర్కొన్నారు.

స్వల్పంగా ప్రవహిస్తున్న మానేరు

మల్హర్, మే 18 : మండలంలో మొన్నటి వరకు ఏడారిని తలపించిన మానేరు ఎగువన కురిసిన భారీ వర్షాల వల్ల స్వల్పంగా ప్రవహిస్తోంది. మరో రెండుసార్లు వర్షాలు కురిస్తే మానేరు నది ప్రవహం పెరగనుంది. పిల్లలకు వేసవి సెలవులు కావడం మానేరు ప్రవాహం స్వల్పగా సాగుతుండటంతో సాయంత్రం సమయంలో చిన్న, పెద్ద అందరు అక్కడికి చేరుకుంటున్నారు.

యువతకు క్రికెట్ కిట్ పంపిణీ

వెంకటాపురం(నూగూరు), మే 18 : మండలంలోని వాడగూడెం గ్రామ యువతకు కాంగ్రెస్ మండల నాయకుడు మన్నెం సునీల్ ఆర్థిక సహాయంతో నేతకాని సంక్షేమ సంఘం నాయకులు శనివారం క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జాడి ఈశ్వర్ మాట్లాడుతూ గ్రామాల్లోని యువత చెడు అలవాట్లకు పోకుండా క్రీడల్లో రాణించి మంచిపేరు తీసుకురావాలన్నారు. అదేవిధంగా చదువులోను ముందుండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జాడి ప్రతాప్, నందు, కిషోర్, చిరంజీవి, చరణ్, నిర్మల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడపొద్దు

మొగుళ్లపల్లి, మే 18: ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడపొద్దని స్థానిక ఎస్సై బి.అశోక్ వాహనదారులకు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన ధ్రువపత్రాలు, హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతులు

వాజేడు, మే 18: మండలంలోని జగన్నాథపురం నుంచి వెంకటాపురం వరకు గల 16 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. గతేడాది ఇదే రహదారిపై బీటీ నిర్మాణం చేపట్టగా ఇసుక లారీలు, వర్షాల వల్ల నిర్మించిన ఏడాదికే కొట్టుకుపోయింది. దీంతో స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇటీవల మండల పర్యటనకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పలువురు ఫిర్యాదు చేయటంతో స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వర్షాకాలం నాటికి రహదారి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు రహదారిపై మరమ్మతులు చేపట్టారు. వర్షాకాలం ప్రారంభం నాటికి పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులు అధైర్యపడొద్దు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

సివిల్ సప్లయ్ జిల్లా అధికారి రాంపతి



జీవంతరావుపల్లిలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న రాంపతి

ములుగు కలెక్టరేట్, మే 18 : జిల్లాలోని రైతులు అధైర్యపడొద్దని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సివిల్ సప్లయ్ జిల్లా అధికారి బి.రాంపతి అన్నారు. శనివారం ఆయన ములుగు మండలంలోని బండారుపల్లి, జీవంతరావుపల్లి, అబ్బాపురం, జంగాలపల్లి, ఇంచర్ల, వెంకటాపూర్, గోవిందరావుపేట మండలంలోని చల్వాయి, గోవిందరావుపేట, తాడ్వాయి మండలంలోని కాటాపూర్, గంగారం, అన్నారం,వెంకటాపురం, ఏటూరునాగారం మండలంలోని ఆకులవారి ఘణపూర్, చిన్నబోయినపల్లి, తదితర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి తూకం వేసిన బస్తాలను లారీల్లో మిల్లులకు తరలించారు. ఈ సందర్భంగా రాంపతి మాట్లాడుతూ రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని అన్నారు. వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తూ రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్త పడాలని కోరారు. అనంతర వెంకటాపూర్ మండలంలోని లింగాపూర్ సమీపంలో గల ఆదిత్య ఆగ్రోటెక్ రైస్‌మిల్లును తనిఖీ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

తాడ్వాయి : మండలంలోని గంగారం, కాటాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం మండలవ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మూడు రోజుల్లో వర్షాలు పడే సూచన ఉందని, రైతులు తమ ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ఆయన వెంట ఏఈవోలు రవికుమార్, భవాని, రైతులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అద్భుతమైన లాభాలు

జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి అనసూయ



నర్సరీలో ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్నఅధికారి అనసూయ

ములుగు, మే 18 : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అద్భుతమైన లాభాలు గడించవచ్చని, ఎకరాకు రూ.లక్ష ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి గుండె అనసూయ అన్నారు. శనివారం ఆమె కేన్ కంపెనీ నర్సరీ, ఫ్యాక్టరీ నిర్మాణ స్థలాలను ఉద్యానశాఖ అధికారి కళ్యాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ ములుగు జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ఇక్కడి సహజ నేలలు, నీటి వనరులు ఆయిల్‌పామ్ దిగుబడికి సహకరిస్తాయని అన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 1775 ఎకరాల్లో రైతులు పంట సాగు చేస్తున్నారని కానీ, తమ లక్ష్యం మాత్రం 5వేల ఎకరాలను సాగు చేసేందుకు ప్రోత్సహించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. 3 నుంచి 5 వేల ఎకరాలు సాగు చేస్తేనే ఫ్యాక్టరీ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు.

జిల్లాలో కేన్ కంపెనీ యాజమాన్యం ఫ్యాక్టరీ నిర్మాణం చేసేందుకు వేగంగా చర్యలు చేపట్టిందని, పామాయిల్ సాగు చేస్తున్న రైతులు ఎలాంటి భయాందోళన చెందవద్దని అన్నారు. పంట దిగుబడిని పూర్తిగా కేన్ కంపెనీ కొనుగోలు చేస్తుందని ఆమె రైతులకు భరోసా ఇచ్చారు. ఇప్పటికే నర్సరీలలో 2లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కోతుల బెడద లేకుండా తక్కువ పెట్టుబడితో ఎకరాకు రూ.లక్షా 20వేల ఆదాయం ఆయిల్‌పామ్ పంట సాగుతోనే సాధ్యమవుతుందని అన్నారు. జిల్లాలోని రైతులు ఈ అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని రైతుల గురించి ఉద్యానవనశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లగా దరఖాస్తు చేసుకుంటే ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుచేయాలనుకునే రైతులుమరింత సమాచారం కోసం ఉద్యానవనశాఖ అధికారులు, కేన్ కంపెనీ మార్కెటింగ్ సిబ్బందిని సంప్రదించాలని ఆమె సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

గోవిందరావుపేట, మే 18 : ఇసుక లారీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పస్రా ఎస్సై కమలాకర్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన పోలీసు సిబ్బందితో కలిసి పస్రాలో జాతీయ రహదారిపై వాహన తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై లారీల పత్రాలను పరిశీలించి డ్రైవర్లకు సూచనలు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా జాతీయ రహదారికి ఇరువైపులా లారీలను ఆపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అధిక లోడుతో వెళ్లినా, ట్రాఫిక్ నియమాలు పాటించకపోయినా, అతివేగంతో వాహనాలు నడిపినా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

పిడుగుపాటుకు దుక్కిటెద్దు మృతి

కాటారం, మే 18: మండలంలోని పోతులవాయి సమీపంలో ఇబ్రహీంపల్లి గ్రామంలోని బొడ్డు సమ్మయ్య అనే రైతుకు చెందిన దుక్కిటెద్దు శనివారం తెల్లవారుజామున పిడుగుపాటుతో మృతి చెందింది. శుక్రవారం మేత కోసం వెళ్లిన ఎద్దు రాత్రి కూడా ఇంటికి రాలేదని, శనివారం ఉదయం చేలల్లో వెదుకగా పిడుగుపాటుతో మృతి చెంది కనిపించిందని బాధిత రైతు సమ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడినైన తనకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు సమ్మయ్య, నాయకులు దబ్బెట రాజేశం, చీర్ల తిరుపతి, అలీం తదితరులు కోరారు.

అత్యధిక కేసుల పరిష్కారానికి సహకరించాలి

ములుగు కలెక్టరేట్, మే 18 : జూన్ 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి బార్ అసోసియేషన్ సభ్యులు సహకరించాలని సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్ అన్నారు. శనివారం ములుగులోని జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజీ పడదగు కేసుల పరిష్కారానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రాజీమార్గం ద్వారా వారి కేసును పరిష్కరించుకునేలా అందరూ సహాయపడాలన్నారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.సునీల్‌కుమార్, న్యాయవాదులు మేకల మహేందర్, ఆర్.భిక్షపతి, బి.స్వామిదాస్, రాజ్‌కుమార్, ప్రతాప్, డి.సంజీవ్, ఎమ్డీ. మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆరాధన మహోత్సవ వేడుకలు

ఏటూరునాగారం, మే 18 : మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో శనివారం ఆరాధన మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు విశ్వబ్రాహ్మణులు, మహిళా భక్తులు, గ్రామస్తులు దేవాలయానికి చేరుకొని స్వామి వారిని అందంగా అలంకరించారు. అనంతరం జీవ సమాధి, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నదానం చేపట్టారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నేత రవికుమార్

గోవిందరావుపేట, మే 18: జిల్లాలోని రైతులు అకాల వర్షాలతో పంటలు నష్టపోయారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. ధాన్యం ఆరబెట్టే అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని పస్రాలో శనివారం పార్టీ జిల్లా కమిటీ సమావేశం గ్యానం వాసు అధ్యక్షతన జరగగా రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ప్రధానంగా గోదావరి పరీవాహక ప్రాంతంలో మిర్చి పంటను రైతులు పండిస్తున్నారని, వారికి ఎలాంటి గిడ్డంగి సౌకర్యం లేకపోవడం వల్ల తక్కువ ధరకే అమ్ముకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ఏటూరునాగారంలో ప్రభుత్వమే మిర్చిని నిల్వ చేసుకునేందుకు ఏసీ గోదాములు నిర్మించాలని, గోదావరి నీటిని ఐదు మండలాల్లోని రైతులకు అందించాలని, వాజేడులో మోడికుంట,గుండ్లవాగు ప్రాజెక్టులను నిర్మించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తునికాకు కూలీలకు బోనస్ డబ్బులు చెల్లించాలన్నారు. లేనట్లయితే సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, నాయకులు బీరెడ్డి సాంబశివ, చిట్టిబాబు, రాజేందర్, రఘు పాల్గొన్నారు.

టీఎస్‌ను టీజీగా మార్చాలి

భూపాలపల్లి కలెక్టరేట్, మే 18 : టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పీఎస్‌యూ, ప్రభుత్వరంగ సంస్థలు, ఏజెన్సీలు పేర్లను టీఎస్ బదులుగా టీజీగా మార్చాలని కేంద్రం గత మార్చిలో వాహనాలకు గెజిట్ జారీ చేసిందన్నారు. తాజాగా ప్రభుత్వ వ్యవహారాల్లో టీజీనే వినియోగించాలని అనుమతి ఇవ్వడంతో అన్ని ప్రభుత్వ శాఖలు టీఎస్‌కు బదులుగా టీజీని వినియోగించాలని సూచించారు. ఈనెల 25 లోపు అన్ని శాఖలు పేరు మార్పుపై తీసుకున్న చర్యలపై నివేదికలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆట్టి నివేదికలను క్రోడీకరించి ప్రభుత్వానికి పంపనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వాజేడు, మే 18: మండల కేంద్రంలో ఉన్న ఐటీఐలో 2024-25 సంవత్సరానికి గాను విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రీషియన్‌లో 20 సీట్లు, ఫిట్టర్‌లో 20, ఎలక్ట్రానిక్ మెకానిక్‌లో 24, డ్రాఫ్ట్‌మెన్ సివిల్‌లో 24, కోపాలో 48 సీట్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకొని వెబ్ ఆప్షన్‌లను ఎంచుకొనుటకు జూన్ 10వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు చెప్పారు. పూర్తి వివరాల కోసం వాజేడు ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలి

టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



పాల్గొన్న ఎస్పీ, అదనపు కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, మే 18: జూన్ 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలని టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షలను ఎటువంటి పొరపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ పర్యవేక్షించే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపిన మహేందర్‌రెడ్డి 4,473 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు.

దివ్యాంగులైన అభ్యర్థుల కోసం గ్రౌండ్ ఫ్లోర్‌ను కేటాయించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు 3 కిలోమీటర్ల లోపు జిరాక్స్ సెంటర్లను మూసివేయడంతో పాటో పరీక్ష కేంద్రాల 100 మీటర్ల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. అత్యవసర వైద్య చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు మహిళా అభ్యర్థులను పరిశీలించేందుకు మహిళా కానిస్టేబుళ్లను విధుల్లో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరవ గనిలో అధికారుల నిర్లక్ష్యంపై ఆరా!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాకతీయఖని, మే 18 : సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-6వ గనిలో అధికారుల నిర్లక్ష్యంపై ఏరియా ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. శనివారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'కేటీకే-6వ గనిలో నిర్లక్ష్యం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఏరియా ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు గని పరిస్థితులపై విచారిస్తున్నట్లు తెలుస్తోంది. కేటీకే-6వ గని అధికాల తీరుపై ఏరియా ఉన్నతాధికారి తీవ్రంగా మందలించినట్లు సమాచారం. పని స్థలాల్లో కల్పించాల్సిన వసతుల పట్ల అధికారులు వహిస్తున్న నిర్లక్ష్యంపై సింగరేణి కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఏరియాలో తీవ్ర చర్చ జరుగుతోంది. కార్మికులకు కనీస సౌకర్యాలను అందించకపోవడం పట్ల అధికారులపై మండిపడుతున్నారు.

బస్టాండ్ స్థలం వద్ద నిర్మాణ పనులకు యత్నం

సర్వే నిర్వహించిన తర్వాత చేయాలని అడ్డుకున్న ఆర్టీసీ అధికారులు



పనులను అడ్డుకుంటున్న ఆర్టీసీ అధికారులు

కాటారం, మే 18 : మండల కేంద్రంలోని కాటారం-2 ఆర్టీసీ బస్టాండ్ స్థలం వద్ద శనివారం ప్లాట్ల యజమానులు నిర్మాణ పనులు చేపడుతుండగా ఆర్టీసీ అధికారులు అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కోర్టు నుంచి తమకు ఆర్డర్స్ ఉన్నాయని చంద్రశేఖర్ రావు ఆర్టీసీ అధికారులకు తెలిపారు. తమ ప్లాట్లలో పనులు చేసుకుంటే అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసు అధికారులు ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. తమ ఆర్టీసీ ఇంజనీరింగ్ అధికారులు సర్వే చేసిన అనంతరం పనులు చేసుకోవాలని, ఆర్టీసీ స్థలంలో పనులు జరగడానికి వీల్లేదని వరంగల్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్, భూపాలపల్లి డీఎం లక్ష్మీనారాయణ తెలిపారు. దీనిపై ఇరు వర్గాలతో మాట్లాడిన సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ సంయమనం పాటించి సర్వే చేసుకుని అనంతరం పనులు చేసుకోవాలన్నారు. వివాదం లేని స్థలంలో పనులు చేసుకుంటామని భూమి, ప్లాట్ల యజమానులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్సై శ్రీనివాస్, విజిలెన్స్, సెక్యూరిటీ విభాగం సిబ్బంది ఉన్నారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

మంగపేట, మే 18: మండలంలోని కోమటిపల్లి సబ్ సెంటర్ పరిధిలోని పోషమ్మగుడి ఆవాసాన్ని శనివారం జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య సందర్శించారు. గొత్తికోయలతో మాట్లాడి వైద్యం సకాలంలో అందుతుందా? లేదా? అని తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది వచ్చి మెరుగైన వైద్యం అందిస్తారని గొత్తికోయలకు వివరించారు. అనంతరం బ్రాహ్మణపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రసూతి కేసులు ఏమైనా ఉంటే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి సుఖ ప్రసవాలు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. రాజుపేట ఆరోగ్య ఉపకేంద్రం నూతన భవనాన్ని సందర్శించగా వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ కొన్ని పనులు అసంపూర్తిగా ఉన్నాయని జిల్లా వైద్యాధికారికి వివరించారు. కాంట్రాక్టర్‌కి వారం లోపు పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. చుంచుపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి జరుగుతున్నాయని జాతరకు సంబంధించిన మందులను సమకూర్చుకోవాల్సిందిగా వైద్యులు, ఫార్మసిస్టులకు సూచించారు. జిల్లా వైద్యాధికారి వెంట వైద్యులు కారం నిఖిల్‌కుమార్, వేణు, వైశ్యాలితో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

వెంకటాపూర్(రామప్ప), మే 18: తాటిచెట్టు పైనుంచి పడి ఓ గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శనివారం మండల కేంద్రంలోని తాళ్లపాడు సెంటర్‌లో గల తాటివనంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. వృత్తిలో భాగంగా గీత కార్మికుడు దేశిని రాజుగౌడ్ తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా మోకు జారి కింద పడిపోయాడు. దీంతో రాజుగౌడ్‌కు కాళ్లు, చేతులు విరిగిపోయాయి. గమనించిన తోటి గీత కార్మికులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. కాగా, రాజుగౌడ్ కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని గీతకార్మిక సంఘం మండల నాయకులు కోరారు.